సాక్షి
ఏలూరు
మంగళవారం । 28 । ఫిబ్రవరి । 2023



హుండీ ఆదాయం లెక్కింపు

నరసాపురం రూరల్: లక్ష్మణేశ్వరంలోని దుర్గాలక్ష్మణేశ్వరస్వామి హుండీ ఆదాయాన్ని లెక్కించారు. మహాశివరాత్రి సందర్భంగా రూ.3,49,603 ఆదాయం లభించింది.



ఈవీఎం గోదాము పరిశీలన

ఏలూరు (మెట్రో): కలెక్టరేట్‌లోని ఎలక్ట్రానిక్ ఓటింగ్ మెషీన్ల (ఈవీఎం), వీవీప్యాట్ గోదామును సోమవారం ఏలూరు జిల్లా కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ పరిశీలించారు.




అగ్నిప్రమాదాలపై అప్రమత్తం

ఆకివీడు: దుంపగడపలోని వీవీ గిరి ప్రభుత్వ కళాశాలలో అగ్నిప్రమాదాల నివారణపై ఎస్‌ఎఫ్‌ఓ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పునరావాసం.. అద్భుత నిర్మాణం

- సుందరంగా నిర్వాసిత కాలనీలు
- ఉభయగోదావరి జిల్లాల్లో 53 కాలనీల నిర్మాణం
- ఏలూరు జిల్లా తాడువాయిలో మెగా లేఅవుట్
- రూ.435 కోట్లతో 3,905 ఇళ్లు
- రూ.1,523 కోట్లతో పోలవరం పునరావాస కాలనీలు



తాడువాయిలో పూర్తయిన మెగా కాలనీ

సాక్షి ప్రతినిధి, ఏలూరు: పోలవరం పునరావాస కాలనీలు సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్నాయి. ముంపు నిర్వాసితులకు మెరుగైన సౌకర్యాలతో నివాసాలను ఏర్పాటు చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా వీటిని నిర్మిస్తుంది. ఇప్పటికే ఏలూరు జిల్లాలోని తాడువాయిలో మెగా కాలనీతో పాటు బుట్టాయగూడెంలో కొన్ని కాలనీలు పూర్తికాగా.. నిర్వాసితులు కొందరు నూతన గృహాలకు చేరారు. పూర్తి స్థాయిలో పరిహారం అందిన వారిని ఇళ్లకు తరలించే దిశగా జిల్లా యంత్రాంగం కసరత్తు చేస్తుంది. ఉభయగోదావరి జిల్లాల్లో రూ.1,523 కోట్ల వ్యయంతో 53 కాలనీల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి.

తాడువాయిలో భారీగా..

ఏలూరు జిల్లాలో నిర్వాసితుల ఇళ్ల నిర్మాణం వేగంగా సాగుతోంది. ప్రధానంగా జంగారెడ్డిగూడెం రూరల్ మండలంలోని తాడువాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో భాగంగా 6,048 ఇళ్ల నిర్మాణానికి భూసేకరణ ప్రక్రియ పూర్తి చేశారు. మొత్తం 1,047 ఎకరాలు భూమి సేకరించగా గృహాలు, మౌలిక వసతుల కోసం 532 ఎకరాల భూమి కేటాయించారు. అలాగే రూ.435.05 కోట్ల వ్యయంతో 3,905 ఇళ్ల నిర్మాణం ప్రారంభించి అనుకున్న సమయానికి పూర్తి చేశారు. కొందరు లబ్ధిదారులు గతేడాది గృహప్రవేశాలు చేశారు. 938 మంది ప్లాట్లు తీసుకుని వారే స్వయంగా ఇళ్లు నిర్మించుకోనున్నారు. మరో 1,205 ప్లాట్ల నిర్మాణం పూర్తయ్యింది. పోలవరం నియోజకవర్గంలోని వేలేరుపాడు, కుక్కునూరు మండలాల నిర్వాసితులతో పాటు పోలవరం, తూర్పుగోదావరి జిల్లాలోని కొన్ని గ్రామాలకు చెందిన గిరిజనేతరుల కోసం తాడువాయిలో పునరావాస కాలనీలు నిర్మించారు. పూర్తి నాణ్యతా ప్రమాణాలతో వందల కోట్లు ఖర్చు చేసి సకల సౌకర్యాలతో వీటిని తీర్చిదిద్దుతున్నారు. దీనిలో 530 ఎకరాల్లో పునరావాస కాలనీలు, మిగిలిన 517 ఎకరాల్లో యువతకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్లు, వాటికి అనుగుణంగా కుటీర పరిశ్రమలను ఏర్పాటు చేసేలా భూములు గుర్తించారు.

తాడువాయి మెగా లేఅవుట్

మొత్తం ఇళ్లు	6,048
ప్రభుత్వం నిర్మించి ఇచ్చే ఇళ్లు	3,905
నిర్వాసితులు సొంతంగా నిర్మించుకునేవి	2,143
ఆర్‌అండ్‌ఆర్ కోసం సేకరించిన భూమి	1,047 ఎకరాలు
ఇళ్లు, మౌలిక వసతులకు కేటాయింపు (మిగిలిన భూమి భవిష్యత్తు అవసరాల కోసం)	530 ఎకరాలు
మౌలిక వసతుల్లో భాగంగా నిర్మించే కట్టడాలు	62
ప్రాజెక్టు వ్యయం అంచనా	రూ.435.05 కోట్లు



బుట్టాయగూడెం మండలంలో..

బుట్టాయగూడెం మండలంలోని పైడాకులమామిడి, అల్లవరం, పల్లపూరు, నులకలగూడెం, తూడుగుంట, సరుగుడులోని కాలనీల్లో సుమారు 1,500కు పైగా ఇంటి నిర్మాణాలు పూర్తికాగా నిర్వాసితులను ఇక్కడకు తరలించారు. కాలనీల్లో సచివాలయాలు, ఇతర ప్రభుత్వ కార్యాలయాలు ఏర్పాటుతో పాటు స్థానికుల అవసరాలకు అనుగుణంగా నిర్మాణాలు చేస్తున్నారు. జీలుగుమిల్లి మండలంలో కామయ్యపాలెం, రౌతుగూడెం, పోలవరం మండలం ఎల్ఎన్‌డీపేటలో నూరుశాతం నిర్మాణాలు పూర్తికాగా కొందరు కొత్త ఇళ్లకు చేరారు.

నైపుణ్య శిక్షణకు.. గతేడాది ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్ తాడువాయిలోని మెగా కాలనీలను సందర్శించారు. మహిళలకు, యువతకు స్కిల్‌డెవలప్‌మెంట్ సెంటర్‌ను ఏర్పాటు చేయాల్సిందిగా నిర్వాసితులు కోరగా ఆ దిశగా సర్కారు కసరత్తు చేస్తోంది. పూర్తిగా నాన్‌ట్రైబల్ కాలనీ కావడంతో స్థానిక అవసరాలకు అనుగుణంగా శిక్షణ ఇచ్చేలా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ప్రభుత్వం జిల్లా యంత్రాంగాన్ని ఆదేశించింది.

ఉల్లాసం తలపించేలా.. కాలనీల్లో గుడి, మసీదు, చర్చి, అంగన్‌వాడీ కేంద్రం, కమ్యూనిటీ హాలు, పంచాయతీ కార్యాలయం, షాపింగ్ కాంప్లెక్స్, పాఠశాలలు, బ్యాంకు, రైతుబజార్, ఏఎన్ఎం సబ్‌సెంటర్, పశు వైద్యశాల, గోడౌన్లు, మినీ కోల్డ్ స్టోరేజీలు, వాటర్ ట్యాంక్, బస్‌షెల్టర్, ఇండోర్‌స్టేడియం, డంపింగ్ యార్డ్, పోస్టాఫీస్, పీహెచ్‌సీ, శ్మశానవాటికలు–3, వ్యక్తిగత మరుగుదొడ్లు, రెండు పార్కులు నిర్మించేలా ప్లాన్‌లో రూపొందించారు.

చాలా బాగున్నాయి



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్వాసిత కాలనీలను అద్భుతంగా కట్టించారు. ప్రజల సంక్షేమం, అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోంది. వలంటీర్లు, సచివాలయాల వ్యవస్థ ద్వారా లక్షల్లో ఉద్యోగాలు కల్పించింది. అలాగే నిర్వాసిత యువతకు కుటీర పరిశ్రమలు ఏర్పాటు చేసి ఉపాధి కల్పనకు తోడ్పాటు అందించాలని కోరుతున్నాం.

– బద్దె ప్రేమ్‌కుమార్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, చల్లవారిగూడెం

ప్రతి వారం సమీక్ష



నిర్వాసితులను త్వరితగతిన కాలనీలకు తరలించేలా చర్యలు తీసుకున్నాం. ప్రతి వారం పోలవరం ఆర్‌అండ్‌ఆర్‌పై సమీక్ష నిర్వహించి సమస్యలను పరిష్కరించే దిశగా అడుగులు వేస్తున్నాం. మిగిలిన అంశాలపై ప్రభుత్వానికి నివేదిస్తున్నాం. పూర్తయిన ఇళ్లకు నిర్వాసితులు చేరేలా ప్రభుత్వం అన్నివిధాలా సహకరిస్తోంది.

– వె.ప్రసన్న వెంకటేష్, కలెక్టర్, ఏలూరు జిల్లా

మాతా, శిశు మరణాల కట్టడికి చర్యలు

కలెక్టర్ ప్రసన్న వెంకటేష్



సమీక్షిస్తున్న కలెక్టర్

ఏలూరు(మెట్రో): జిల్లాలో మాతా, శిశు మరణాలు సంభవించకుండా, వీటి కట్టడికి పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత వైద్యులు, వైద్యారోగ్య శాఖ అధికారులపై ఉందని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ అన్నారు. కలెక్టరేట్‌లో సోమవారం మాతా, శిశు మరణాలపై ఆయన సమీక్షించారు. మాతృ మరణాలకు దారితీసిన కారణాలపై వైద్యుల నివేదికలను పరిశీలించారు. గర్భిణులకు చికిత్స విషయంలో నిర్లక్ష్యానికి తావులేదని, ముఖ్యంగా మహిళ గర్భం దాల్చినప్పటి నుంచి అన్నిరకాల పరీక్షలతో పాటు పోషకాహారం అందించేలా చర్యలు తీసుకోవాలన్నారు. హైరిస్కు కేసుల్లో గర్భం దాల్చిన మహిళలకు 34వ వారం నుంచి ప్రతివారం వైద్య పరీక్షలు చేయించేలా ఎంఎల్‌హెచ్‌పీలకు శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. మాతా, శిశు మరణాల నివారణపై జూనియర్ డాక్టర్లకు అవగాహన పెంచాలన్నారు. డీఎంహెచ్ఎం డి.ఆశ, డీఐఓ నాగేశ్వరరావు, ఆర్ఎంఓ పి.శ్రీనివాసరావు, గైనకాలజిస్ట్ పద్మ పాల్గొన్నారు.

జూన్ నాటికి గృహప్రవేశాలు

జిల్లాలో జూన్ నాటికి జగనన్న ఇళ్లను గృహప్రవేశాలకు సిద్ధం చేయాలని, లక్ష్యాలను నూరు శాతం పూర్తిచేసేందుకు 100 రోజుల కార్యాచరణ ప్రణాళిక అమలు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. జగనన్న ఇళ్ల నిర్మాణాల ప్రగతిపై ఆయన సమీక్షించారు. జగనన్న లేఅవుట్లలో 89 వేల ఇళ్ల నిర్మాణం లక్ష్యం కాగా, ఇప్పటివరకు అనుకున్న రీతిలో ప్రగతి లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ఉగాది నాటికి 25 వేల నిర్మాణాలు పూర్తిచేసేలా ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అదనపు రుణం తీసుకుని నిర్మాణాలు ప్రారంభించని వారి నుంచి లోన్ రికవరీ చేయాలని ఆదేశించారు. కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

న్యూస్‌రీల్

ముఖ్యమంత్రి పర్యటనకు పటిష్ట ఏర్పాట్లు



హెలీప్యాడ్ పనులను పరిశీలిస్తున్న కలెక్టర్

యలమంచిలి: ప్రభుత్వ చీఫ్‌విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు కుమార్తె వివాహం వచ్చేనెల 5వ తేదీన కలగంపూడి గ్రామంలో జరుగనుండగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. ఈ మేరకు కాజ తూర్పు గ్రామంలోని నరేంద్రస్వామి దేవస్థానం భూమిలో నిర్మిస్తున్న హెలీప్యాడ్ నిర్మాణ పనులను సోమవారం కలెక్టర్ పి.ప్రశాంతి పరిశీలించారు. సీఎం పర్యటనకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని ఆమె అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా కేటాయించిన పనుల్లో ఎక్కడా లోటుపాట్లు రాకుండా త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. కలగంపూడిలో నిర్మిస్తున్న వివాహ వేదిక పనులను కూడా ఆమె పరిశీలించారు. ఎస్పీ యు.రవిప్రకాష్, ఇన్‌చార్జి జాయింట్ కలెక్టర్ ఎం.సూర్యతేజ, ఆర్‌అండ్‌బీ అధికారి ఎస్.లోకేశ్వరరావు, డీపీఓ ఎం.నాగలత, డీఎస్పీ కె.రవిమనోహరాచారి, తహసీల్దార్ లక్కు నరసింహారావు, ఎంపీడీఓ చివటం త్రిశూలపాణి ఆమె వెంట ఉన్నారు.

బాధితులకు సత్వర న్యాయం



వినతులు స్వీకరిస్తున్న ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ

ఏలూరు టౌన్: స్పందనలో ఫిర్యాదులు అందించిన బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ రాహుల్‌దేవ్‌శర్మ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమంలో భాగంగా పలువురి నుంచి ఆయన వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పోలీసు అధికారులను ఆదేశించారు.

అర్జీల్లో కొన్ని..

- ఏలూరులో అపార్ట్‌మెంట్ కోసం రూ.12 లక్షలు చెల్లించగా తనకు ఫ్లాట్ అప్పగించలేదని, అడిగితే కేసు పెడతానంటూ బెదిరిస్తున్నారని ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు.
- తనను అసభ్య పదజాలంతో ఓ వ్యక్తి వేధిస్తున్నాడని ముసునూరు మండలం సింహాద్రిపురానికి చెందిన మహిళ ఫిర్యాదు చేశారు.

పరిశోధనలతో దేశ ప్రగతి



మాట్లాడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ పెద్దిరెడ్డి

తాడేపల్లిగూడెం: పరిశోధనలు ప్రయోగశాలల నుంచి క్షేత్రస్థాయికి చేరినప్పుడే వాటికి సార్థకత ఉంటుందని, పరిశోధనలపైన దేశ ప్రగతి ఆధారపడి ఉందని ఐఐటీ భువనేశ్వర్ స్కూల్ ఆఫ్ బేసిక్ బిజినెస్ విభాగం ప్రొఫెసర్ వీఆర్ పెద్దిరెడ్డి అన్నారు. జాతీయ సైన్సు దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఏపీ నిట్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పరిశోధనా ఫలితాలను ప్రజలకు చేరేలా ప్రయత్నించాలన్నారు. నిట్ ఇన్‌చార్జి రిజిస్ట్రార్ దినేష్ పి.శంకరరెడ్డి మాట్లాడుతూ ప్రాథమిక అంశాలకు సాంకేతికతను జోడించి నూతన ఆవిష్కరణలు చేయాలన్నారు. సీవీ రామన్‌ను విద్యార్థులు ఆదర్శంగా తీసుకోవాలన్నారు. సీఎస్ఐఆర్–ఎన్‌పీఎల్ ఫార్మర్ డైరెక్టర్ డాక్టర్ డీకే అశ్వాల్ ఆన్‌లైన్‌లో మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారత్ ప్రపంచదేశాలకు ధీటుగా రాణిస్తుందన్నారు.

ఈపీఎఫ్‌ఓ సేవలపై అవగాహన



మాట్లాడుతున్న సహాయ కమిషనర్

సాక్షి, భీమవరం: ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ (ఈపీఎఫ్ఓ) సేవలను సక్రమంగా వినియోగించుకోవాలని ఆ సంస్థ సహాయ కమిషనర్ యమజాల దుర్గాశ్రీనివాస్ అన్నారు. సోమవారం స్థానిక విష్ణు కళాశాల ఆడిటోరియంలో ఈపీఎఫ్ఓ ఖాతాదారుల అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈపీఎఫ్ఓ సేవలపై అవగాహన, వినతుల స్వీకరణ, పరిష్కారం, ఉద్యోగుల భవిష్య నిధి పథకం, ఉద్యోగుల పింఛన్ పథకం, ఉద్యోగుల పొదుపు ఆధారిత బీమా పథకం, ఉద్యోగుల భవిష్య నిధి పథకం, భవిష్య నిధి సొమ్మును ఉపసంహరించుకోవడం, పీఎఫ్ సొమ్ము బదలీ, ఈకేవైసీ, యూఏఎన్ వంటి అంశాలపై వివరించారు. మేనేజర్ కె.శ్రీనివాస్ మాట్లాడారు.

విషప్రచారాన్ని తిప్పికొట్టండి

వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని



అనుబంధ సంఘాల అధ్యక్షులతో పార్టీ జిల్లా అధ్యక్షుడు ఆళ్ల నాని

ఏలూరు టౌన్: ప్రభుత్వంపై ప్రతిపక్షాలు చేస్తున్న విషప్రచారాన్ని తిప్పికొడుతూ, సంక్షేమ పథకాలపై విస్తృత ప్రచారం చేయాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్యే ఆళ్ల నాని పిలుపునిచ్చారు. ఏలూరులోని పార్టీ జిల్లా కార్యాలయంలో సోమవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన అనుబంధ సంఘాల అధ్యక్షులతో అయన సమావేశమయ్యారు. విష ప్రచారాన్ని సమర్థంగా తిప్పికొడుతూ.. ప్రజలకు వాస్తవాలు తెలియజేయాలన్నారు. సీఎం జగన్ ఇచ్చిన హామీలు, వాటిని అమలు చేసిన విధానాలపై ప్రజలకు వివరించాలన్నారు. సీఎం జగన్ పాలనతో రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ పథకాలు అందిస్తున్నామన్నారు. అయితే నిత్యం చంద్రబాబు అతని దుష్టచతుష్టయం కుట్రలు చేస్తూ అపోహలు కలిగించేలా అసత్య వార్తా కథనాలను ప్రచురించడాన్ని ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. చంద్రబాబు, లోకేష్‌కు టీడీపీ అధికారంలోకి వస్తే ప్రజలకు ఏంచేస్తారో చెప్పే దమ్ము లేదన్నారు. లోకేష్ పాదయాత్ర వెలవెలబోవడంతో చంద్రబాబు గోబెల్స్ ప్రచారానికి తెరతీశారని విమర్శించారు. వైఎస్సార్‌సీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులంతా చిత్తశుద్ధితో సైనికుల్లా పనిచేసి 2024 ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయానికి శ్రమించాలని కోరారు. చింతలపూడి ఎమ్మెల్యే వీఆర్ ఎలీజా, నగర పార్టీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, సీనియర్ నాయకులు మధ్యాహ్నపు బలరాం, కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ బరిలో ఆరుగురు

- నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ పూర్తి
- 13న పోలింగ్.. 16న కౌంటింగ్

సాక్షిప్రతినిధి, ఏలూరు: స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్ల ఉపసంహరణ ప్రక్రియ సోమవారం సాయంత్రం పూర్తికాగా బరిలో ఆరుగురు అభ్యర్థులు నిలిచారు. వీరిలో ఇద్దరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థులతో పాటు నలుగురు స్వతంత్రులు ఉన్నారు. టీడీపీ మండల నాయకుడు ఉండగా, మరికొందరు సానుభూతిపరులు ఉన్నారు. టీడీపీ నుంచి స్పష్టత రాకపోవడంతో ఆ పార్టీ నాయకులే కొందరు సానుభూతిపరులతో నామినేషన్ వేయించారు.

వైఎస్సార్ సీపీ గెలుపు లాంఛనం

అధికార వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా కవురు శ్రీనివాస్, వంకా రవీంద్రనాథ్ బరిలో నిలిచారు. రవీంద్రనాథ్ భార్య రాజకుమారి నామినేషన్‌ను ఉపసంహరించుకున్నారు. మొత్తం 8 మంది అభ్యర్థులు 15 సెట్లు నామినేషన్లు దాఖలు చేయగా తిరస్కరణ, ఉపసంహరణ అనంతరం ఆరుగురు అభ్యర్థులు నిలిచారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులతో పాటు టీడీపీ మండల స్థాయి నాయకుడు వీరవల్లి చంద్రశేఖర్ స్వతంత్ర అభ్యర్థిగా, అలాగే టీడీపీ సానుభూతిపరులుగా దేవరపల్లి ఆదాంతో పాటు స్వతంత్రులుగా గోరింక దాసు, పసలవెంకటాచలం బరిలో నిలిచారు. బరిలో టీడీపీ సానుభూతిపరులు ఉన్న క్రమంలో ఆ పార్టీ మద్దతుపై పార్టీ నేతల్లో స్పష్టత రాలేదు. స్వతంత్రుల్లో ఒకరికి మద్దతు ఇవ్వడం లేదా ఎన్నికలకు దూరంగా ఉండే విషయంపై రెండు రోజుల్లో ప్రకటించనున్నట్లు సమాచారం. స్థానిక సంస్థల్లో 85 శాతానికిపైగా ఓట్లు అధికార వైఎస్సార్ సీపీకి ఉండటంతో పార్టీ అభ్యర్థుల గెలుపు సునాయాసం కానుంది.

ఐదు కేంద్రాల్లో పోలింగ్

వచ్చే నెల 13న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఏలూరు, జంగారెడ్డిగూడెం, భీమవరం, నరసాపురం, కొవ్వూరు ఎంపీడీఓ కార్యాలయాల్లో పోలింగ్ నిర్వహిస్తారు. ఈ మేరకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. 16న కౌంటింగ్ నిర్వహించి 21తో ఎన్నికల ప్రక్రియ ముగించి కోడ్ తొలగిస్తారు.

ఎంసీఎంసీ కమిటీ ఏర్పాటు

ఏలూరు(మెట్రో): ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాస్థాయి మీడియా సర్టిఫికేషన్ మానిటరింగ్ (ఎంసీఎంసీ) కమిటీని ఏర్పాటు చేస్తూ జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. రిటర్నింగ్ అధికారి, జేసీ పి.అరుణ్‌బాబు చైర్మన్‌గా, ఏఆర్ఓ, జిల్లా రెవెన్యూ అధికారి ఏవీఎన్ఎస్ మూర్తి నోడల్ అధికారిగా, డీఐవో జీవీఎస్ఆర్ శర్మ, సెంట్రల్ బ్యూరో కమ్యూనికేషన్ ఇన్ఫర్మేషన్, బ్రాడ్ కాస్టింగ్‌కు చెందిన కె.శ్రీరామమూర్తి, దూరదర్శన్, ఏఐఆర్ కరస్పాండెంట్ ఐ.సుబ్బారావు సభ్యులుగా, జిల్లా సమాచార పౌర సంబంధాల అధికారి ఎస్.భవాని, మెంబర్ సెక్రటరీగా ఉన్నారు.

సర్రాజు సేవలు ఎనలేనివి

సంతాప సభలో వక్తల నివాళి



సర్రాజు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీలు మిథున్‌రెడ్డి, కోటగిరి శ్రీధర్, మంత్రి చెల్లుబోయిన వేణుగోపాల్, ఎమ్మెల్యేలు చెరుకువాడ శ్రీరంగనాథరాజు, గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, నివాళులర్పిస్తున్న మంత్రి కారుమూరి నాగేశ్వరరావు, సంతాప సభకు హాజరైన రాజ్యసభ సభ్యుడు పిల్లి సుభాష్ చంద్రబోస్

ఆకివీడు/కాళ్ల/ఉండి: రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్యే పాతపాటి సర్రాజు సేవలు ఎనలేనివని, ఆయన మరణం వైఎస్సార్ సీపీకి తీరనిలోటని ఎంపీలు మిథున్ రెడ్డి, పిల్లి సుభాష్ చంద్రబోస్, కోటగిరి శ్రీధర్, శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజు, మంత్రులు కారుమూరి నాగేశ్వరరావు, చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ మంత్రి చెరుకువాడ శ్రీరంగనాథరాజు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. భీమవరం ఆదర్శ కాలనీలోని సర్రాజు నివాసం వద్ద సోమవారం సంతాప సభ నిర్వహించారు. ముందుగా సర్రాజు చిత్రపటం వద్ద ముఖ్యులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సర్రాజు సేవాతత్పరుడిగా, అందరివాడిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. కులమతాలు, పార్టీలకు అతీతంగా అన్నివర్గాల ప్రజలకు అండగా ఉన్నారన్నారు. ఆయన కుటుంబానికి పార్టీ అన్నివిధాలా అండగా ఉంటుందన్నారు. సర్రాజు ఆశయాలకు అనుగుణంగా నడుచుకోవాలని పిలుపునిచ్చారు. టీడీపీ కంచుకోటను పగులగొట్టిన ఏకైక నాయకుడు సర్రాజు అని కొనియాడారు. దివంగత వైఎస్సార్ కుటుంబానికి విధేయుడిగా ఉంటూ సీఎం జగన్‌కు అండగా నిలిచారన్నారు. పేదలకు గూడు కల్పించాలనే సంకల్పంతో తాళ్లకోడులో 75 ఎకరాలు కొనుగోలు చేశారని గుర్తు చేశారు. ఉండి కేవీకే కేంద్రానికి, తాళ్లకోడులో పేదల ఇళ్ల కాలనీకి సర్రాజు పేరు పెట్టాలని నాయకులు కోరారు. సంతాప సభలో ఎమ్మెల్యేలు గ్రంధి శ్రీనివాస్, పుప్పాల వాసుబాబు, మంతెన రామరాజు, మాజీ ఎమ్మెల్సీలు మేకా శేషుబాబు, కంతేటి సత్యనారాయణరాజు, మాజీ ఎంపీ కనుమూరి బాపిరాజు, మాజీ ఎమ్మెల్యే వేటుకూరి వెంకట శివరామరాజు, గోకరాజు రామరాజు, గోకరాజు విఠల్ కనక రంగరాజు, కరాటం రాంబాబు, ముత్యాల రత్నం, కనకరాజు సూరి, ఎంబీసీ చైర్మన్ పెండ్ర వీరన్న, గూడూరి ఉమా, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు, కనుమూరి అబ్బాయిరాజు, గాదిరాజు సుబ్బరాజు, పెనుమత్స గోపాలకృష్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

దోపిడీ దొంగల అరెస్టు



తాడేపల్లిగూడెంలో విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్ మూర్తి

తాడేపల్లిగూడెం రూరల్: దారి దోపిడీకి పాల్పడిన నలుగురిని అరెస్టు చేసినట్లు రూరల్ సీఐ ఎస్‌వీవీఎస్.మూర్తి తెలిపారు. సోమవారం రూరల్ సర్కిల్ కార్యాలయంలో మాట్లాడుతూ కృష్ణా జిల్లా నందివాడకు చెందిన ఇలపర్తి అబ్రహాం గుడివాడలోని కుమార్ సోప్స్ కంపెనీ వ్యాన్ డ్రైవర్‌గా పనిచేసేవాడు. చెడు తిరుగుళ్లకు అలవాటు పడి మరో ముగ్గురితో కలిసి చోరీలకు పాల్పడేవాడు. గతంలో అబ్రహాం తాను పనిచేసిన కుమార్ సోప్స్ వ్యాన్ (ఐసర్)కు జీపీఎస్ అమర్చాడు. వ్యాన్ లోడుతో వెళ్ళిన సమయంలో కారులో వెంబడించాడు. ఈ నెల 24న తెల్లవారుజామున 3.10 గంటల ప్రాంతంలో తాడేపల్లిగూడెం మండలం కృష్ణాయపాలెం గ్రామం వద్ద వ్యాన్‌లో ఉన్న డ్రైవర్, గుమస్తాలను కొట్టి రూ.40 వేలు నగదుతో ఉన్న బ్యాగును చోరీ చేసి, పారిపోయారు. దాట్ల రాజా అప్పట్లో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన రూరల్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పెదతాడేపల్లి కమ్మ కళ్యాణమండపం వద్ద అనుమానాస్పదంగా ఉన్న ఇలపర్తి అబ్రహాం (నందివాడ), తిట్ల ఇస్సాకు (బొమ్ములూరు), వమ్మి సురేష్ (పెదపాడు), కోరం ఆనంద్ (పెదపాడు) లను అదుపులోకి తీసుకుని విచారించారు. ఈ క్రమంలో కృష్ణాయపాలెం చోరీకి సంబంధించి నేరం అంగీకరించినట్లు రూరల్ సీఐ మూర్తి తెలిపారు. నిందితుల వద్ద నుంచి రూ.30వేలు రికవరీ చేశామన్నారు.

ఉంగరం కోసమే చంపేశాడు



మాట్లాడుతున్న ఎస్పీ రవి ప్రకాష్, డీఎస్పీ మనోహరాచారి

పాలకొల్లు సెంట్రల్: పట్టణంలోని కనిపించకుండా పోయిన వ్యక్తి 12 రోజులు తరువాత మొగల్తూరు కాలువలో శవమై కనిపించిన సంఘటన సంచలనంగా మారింది. సోమవారం స్థానిక పట్టణ పోలీస్‌స్టేషన్లో ఎస్పీ యు.రవిప్రకాష్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ సోమేశ్వర అగ్రహారానికి చెందిన నిడమర్తి వెంకట సత్య సాంబశివరామ్ (44) స్థానిక పెద్దసాయిబాబా ఆలయం రోడ్డులో ఉన్న ఓ చెక్కల షాపులో వడ్రంగి పని చేసేవాడు. ఈ నెల 11న ఇంటి నుంచి బయలుదేరి వెళ్లిన సాంబశివరామ్ కనిపించకుండా పోయాడు. మృతుని సోదరుడు షాపు యజమానికి ఫోన్ చేసి అడగగా రాత్రి 7.20 గంటలకే వచ్చేశాడని తెలిపారు. మృతుడి మిత్రుడైన ఉల్లంపర్రు గ్రామానికి చెందిన పి. వీర రాఘవులు (వీరబాబు)ను ప్రశ్నించగా రాత్రి ఆర్‌వి సుబ్బారావు ఆసుపత్రి రోడ్డు వద్ద దింపేశానని తెలిపాడు. మృతుని సోదరుడు నిడమర్తి వెంకట సత్య బాల బాలాజీ శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. 12 రోజులు తరువాత నిడదవోలు, మొగల్తూరు కాలువలో సీతారామపురం గ్రామం దాటిన తరువాత కోతుల గుంట ఫుట్ పాత్ బ్రిడ్జి సమీపంలో కాలువలో శవమై తేలాడు. అతని దుస్తులను బట్టి బంధువులు సాంబశివరామ్‌గా గుర్తించారు. మృతుని చేతికి ఉన్న ఉంగరం కనిపించకుండా పోవడంతో అతని స్నేహితుడు వీరబాబుపై అనుమానంతో విచారణ చేయగా అతని చేతికి ఉన్న ఉంగరం లాక్కుని అతన్ని మొగల్తూరు వద్ద కాలువలోకి గెంటినట్లు విచారణలో తేలిందన్నారు. ఉంగరం పట్టణంలో ఓ స్వర్ణకారుడి వద్ద విక్రయించి నగదు తీసుకుని అప్పులు తీర్చుకున్నట్లు తెలిపాడన్నారు. సోమవారం స్థానిక బ్రాడీపేట బైపాస్ రోడ్డు ఆదిత్య కాలేజ్ వద్ద వీరబాబును అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో నరసాపురం డీఎస్పీ మనోహరాచారి, ఇన్‌చార్జ్ సీఐ శ్రీనివాస యాదవ్, ఎస్సై ఎస్ ముత్యాలరావు, ఏఎస్సై ఏసు బాబు, కానిస్టేబుల్స్ మోజేష్, బాలాజీ, ప్రసాద్ బాబు, ఉదయ్, శాంతారావులు పాల్గొన్నారు.

ట్రాక్టర్‌ను ఢీకొన్న కారు



గడ్డి ట్రాక్టర్‌ను ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన కారు ముందు భాగం

మొగల్తూరు: నరసాపురం – మొగల్తూరు జాతీయ రహదారిపై సోమవారం సీతారాంపురం వద్ద ట్రాక్టర్‌ను కారు ఢీకొట్టింది. ఈ ఘటనలో కారు నడుపుతున్న వ్యక్తి సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం జాతీయ రహదారిపై సీతారాంపురం నుంచి నరసాపురం వైపు వెలుతున్న గడ్డి ట్రాక్టర్‌ను వెనుక నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొనడంతో కారు ముందు భాగం నుజునుజ్జు అయింది. ప్రమాదం సమయంలో కారులో ఉన్న బెలూన్లు తెరుచుకోవడంతో కారును నడుపుతున్న వ్యక్తి క్షేమంగా బయటపడ్డాడు.

ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

పెనుగొండ: ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని సీఐ జీవీవీ నాగేశ్వరరావు హెచ్చరించారు. స్థానిక ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన యాంటీ రాగింగ్ సమావేశంలో ఆయన విద్యార్థులకు క్రమ శిక్షణ, సత్ప్రవర్తనతో మంచి భవిష్యత్తు వైపు ముందుకు సాగాలని సూచించారు. ఎస్సై ఎస్ఎన్‌వీవీ రమేష్ మాట్లాడుతూ జీవితంలో లక్ష్యం ఏర్పాటు చేసుకొని క్రమశిక్షణతో నడచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ వైవీవీ అప్పారావు పాల్గొన్నారు.

ప్రీతి మృతికి కారకులపై చర్యలు తీసుకోవాలి

ఏలూరు (టూటౌన్): గిరిజన వైద్య విద్యార్థిని డాక్టరు ధారావత్ ప్రీతి మరణానికి కారకులైన వారిని వెంటనే కఠినంగా శిక్షించాలని ఆల్ ఇండియా బంజారా సేవా సంఘం ఒక ప్రకటనలో డిమాండ్ చేసింది. తెలంగాణా రాష్ట్రంలో ర్యాగింగ్ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నం చేసిన గిరిజన లంబాడీ కుటుంబానికి చెందిన ప్రీతి వరంగల్‌లోని కాకతీయ మెడికల్ కాలేజీలో పీజీ చదువుతుందన్నారు. ఆమె మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు గుగ్గులోతు కృష్ణ నాయక్, సంయుక్త కార్యదర్శి బోడా బాలా నాయక్ కోరారు. సీనియర్ విద్యార్థి వేధిస్తున్నాడంటూ ఫిర్యాదు చేసినా పట్టించుకోకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందన్నారు.

ఇంటర్ ప్రయోగ పరీక్షకు 13,143 మంది హాజరు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా జరుగుతున్న ప్రయోగ పరీక్షల రెండో రోజున ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా వ్యాప్తంగా 13,143 మంది విద్యార్థులు హాజరయ్యారు. జనరల్ విద్యార్థులకు సైన్స్ సబ్జెక్టులో జరిగిన పరీక్షకు సోమవారం 99 కేంద్రాల్లో 10079 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 9868 మంది హాజరయ్యారు. 33 కేంద్రాల్లో ఒకేషనల్ విద్యార్థులకు నిర్వహించిన పరీక్షకు 3650 మంది హాజరు కావాల్సి ఉండగా 3275 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని, ఎక్కడా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలూ జరగలేదని ఇంటర్మీడియట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కే.చంద్రశేఖర బాబు తెలిపారు.

ఈనాడు కథనంపై ఆగ్రహం



పోతునూరులో ఈనాడు పేపర్లను దగ్ధం చేస్తున్న సర్పంచ్ బోదుల స్వరూప్, జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షుడు తలారి రామకృష్ణ

దెందులూరు: దిగజారుడు తనంతో ఈనాడు కథనాలను ప్రచురిస్తే ఊరుకోబోమని పోతునూరు గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్ అన్నారు. సోమవారం పోతునూరు గ్రామంలో సర్పంచ్ బోదుల స్వరూప్ ఆధ్వర్యంలో జిల్లా రేషన్ డీలర్ల అసోసియేషన్ అధ్యక్షులు తలారి రామకృష్ణ, గ్రామస్తులు ఈనాడు పేపరు ప్రతులను దగ్ధం చేశారు. ఇలాంటి కథనాలు ప్రచురిస్తే టీడీపీ మాదిరిగానే ఈనాడు కూడా భవిష్యత్తులో ప్రజల ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. మరోసారి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై తప్పుడు కథనాలు ప్రచురిస్తే గట్టిగా బుద్ధి చెబుతామని సర్పంచ్ స్వరూప్ అన్నారు.

హత్య కేసులో నిందితులకు రిమాండ్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కుకునూరు సీఐ కేవీ సత్యనారాయణ

కుకునూరు: మండలంలోని వెంకటాపురం గ్రామంలో తండ్రిని హత్య చేసిన ఘటనలో నిందితుడైన కుమారుడిని, మృతుడు భార్యను సోమవారం కుకునూరు పోలీసులు అరెస్టు చేసి రిమాండ్ చేశారు. ఈ విషయమై కుకునూరు సీఐ కేవీ సత్యనారాయణ మాట్లాడుతూ వెంకటాపురం గ్రామానికి చెందిన వడ్లకుంట శ్రీను మద్యానికి బానిసై భార్యను, కొడుకును, కోడలిని బూతులు తిడుతూ ఇబ్బందులకు గురిచేస్తుండేవాడని తెలిపారు. ఈ నెల 22న మద్యం సేవించి వచ్చిన శ్రీను కుటుంబసభ్యులతో గొడవ పడి రోకలి బండతో కొట్టడానికి వెళ్లడంతో అదే సమయానికి వచ్చిన కొడుకు వడ్లకుంట వెంకటేశ్వర్లు తన తల్లితో కలిసి శ్రీనును రోకలిబండతో కొట్టి హత మార్చారని, ఆ తరువాత సాక్ష్యాలు దొరకకూడదనే ఉద్దేశ్యంతో శ్రీను తాగిన మత్తులో మెట్లపై నుండి జారిపడి మృతి చెందినట్లు నమ్మించాలని చూసినట్లు చెప్పారు. కేసు దర్యాప్తులో భాగంగా ఆదివారం మధ్యాహ్నం నిందితులను వారి ఇంటి వద్ద అరెస్టు చేసి సోమవారం రిమాండ్ చేశామన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

Real Estate

PLOT FOR SALE

■352Sq.Yds,North-East Corner Residential Plot at Sairam Enclave, Beside Dr. Pinnamaneni Siddhartha Institute of Medical Sciences, Gannavaram is for SALE. 7207705666 [G-398]

COMMERCIAL BUILDING FOR SALE

■ఏలూరు ఆర్. టి. ఎ. ఆఫీస్ వద్ద టొదిమెళ్ళలో డి.టి.సి.పి లేఅవుట్‌లో 153 గ॥లు స్థలంలో నిర్మించిన బిల్డింగ్ అమ్మకమునకు కలదు. సంప్ర: 99494 84286, 83418 46656 [P-1214652]

Services

■వ్యక్తిగత, వ్యాపారం, వ్యవసాయ ఆస్తి, టేక్ఓవర్ లోన్, NPA కేసులు తక్కువ సిబిల్ స్కోర్ కూడా రుణానికి వర్తిస్తాయి. సంప్ర: 94630 26237 [T-P1750]

■We Release your pledged gold బంగారం బ్యాంక్సులో ప్రైవేట్ సంస్థల్లో తనఖాలో ఉన్నవి మాత్రమే విడిపించి కొనబడును. వేలంలో ఉన్న బంగారం విడిపించి తక్కువ గడువుతో, తనఖా ఇవ్వబడును. ✆ : 73966 71666 [R-5668]

GOLD FINANCE

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) (100% జెన్యూన్) ✆ 90009 92521 [B-2281]

■బంగారం బ్యాంకులలో/ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) 100% జెన్యూన్. ✆ 76508 91999 [B-786687]

BUSINESS OFFER

■HEALTHEEK కంపెనీవారు ఫార్మానూత్ర, అగ్రి, హోమ్‌కేర్ ప్రోడక్ట్స్ ఏరియావైజ్ స్టాకిస్టు కావలెను. మరియు ఏరియా మేనేజర్స్, ఎగ్జిక్యూటివ్స్ కావలెను. 7036980433 [G-781847]

■ప్రముఖ కంపెనీలో పని చేయుటకు మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగిన వారు Agents గా కావలెను. ఫోన్ : 9034974058 [H-792938]

■పెట్టుబడి మీరే పెట్టుకొని ఇంట్లో ఉంటూ కొవ్వొత్తులు, ఫ్లోర్ తుడిచే మాప్స్, పెన్సిల్స్, పేపర్ ప్లేట్స్ తయారు చేసి మాకు ఇవ్వండి వీక్లి పేమెంట్, ఫోన్ : 9491996566. [H-793571]

LOST

■I, Shaik Raj Kumar S/o. Shaik Eesu, R/o. Door No. 2-64, T.CH. R Palem, Lingapalem Mandal, Eluru Dist. AP-534462. I have lost my Passport No. S1582328. And Indian CDC (Continues Discharge Certificate) No. MUM333722. If found plz. Call : 9110593554. [HA-10338]

Wanted

■ఏలూరులో శ్రీసర్వోదయ ఏజెన్సీ ఫర్నిచర్ షాపు నందు పనిచేయుటకు అనుభవం గల మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. జీతం మరియు ఇన్సెంటివ్స్ కలవు. సంప్ర॥98483 55649. [P-41]

■శ్రీ విశ్వనాథ మసురూమ్స్ ఫార్మ్ ప్రై లి॥ మల్లుకుంట Near జంగారెడ్డిగూడెం నందు పని చేయుటకు Welder, Fitter, Electrician కావలెను. సంప్ర: 9177650790, 7989636162 [P-713]

■తాడేపల్లిగూడెంలోని ప్రముఖ కాలేజి నందు సెక్యూరిటీ గార్డులు పురుషులు కావలెను. 8 గం. డ్యూటీ, జీతం: 9 వేలు, Q: 10th, వ: 20-48Y. సంప్ర: ✆ 85209 77729, 85209 77739 [B-786502]

■ఏలూరు ప్రఖ్యాత గోల్డ్ షోరూంకి 10th, 5'8", 75Kg, 3 సం. అనుభవంగల సెక్యూరిటీ గార్డులు కావలెను. జీ: 16,500 PF, ESIలతో + ఫ్రీ మీల్స్, లోకల్ వారికి ప్రాధాన్యత. ✆ 94412 39336 [B-786503]

■హైదరాబాద్‌లోని ఆస్తా హోంకేర్‌లో వృద్ధులను చూసుకోవడానికి 21-45 వయసు గల M/F Caretakers కావలెను. జీతం: 16-18 వేలు, భోజనం,వసతి,ఇన్సూరెన్సు కలవు.9381848549 [G-394]

■ఏలూరులోని మోర్ సూపర్ మార్కెట్ నందు పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. శాలరీ : 11000/- 8H, EPF+ ESI కలవు. 9885295999, 9581952222 [G-395]

■ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్‌టైం/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. నెలకు 10-15వేలు వరకు సంపాదన. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-781909]

■మీ ఇంటి వద్దనే వుండి మీ మొబైల్ ద్వారా మా కంపెనీ యొక్క Message పంపుతూ వారాని ₹3500/- సంపాదించుకోండి. వాట్సాప్ చేయండి. 9573633520, 9059633520 [M-1190580]

గమనిక

సాక్షి తెలుగు దిన పత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతి స్పందిం చాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటన దారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

27 లీటర్ల సారా స్వాధీనం



నిందితులతో నూజివీడు సెబ్ అధికారులు

నూజివీడు: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌బ్యూరో(సెబ్)స్టేషన్ పరిధిలోని సెబ్ సిబ్బంది, ఏలూరు అడిషనల్ ఎస్పీ, సెబ్ ఇంటిలిజెన్స్ టీం ఇన్స్‌పెక్టర్ ప్రసాద్‌కుమార్‌తో కలిసి సోమవారం నిర్వహించిన దాడుల్లో 27 లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకున్నట్లు నూజివీడు సెబ్ ఇన్స్‌పెక్టర్ టీ.గోపాలకృష్ణ తెలిపారు. చాట్రాయి మండలంలోని పోతనపల్లి తండాకు చెందిన ధరావతు శంకర్ తన ద్విచక్ర వాహనంపై 25 లీటర్ల కాపుసారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకోవడంతో పాటు ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. ముసునూరు మండలం కొర్లగుంటకు చెందిన పోలగాని మంగయ్య వద్ద 2 లీటర్ల కాపుసారా స్వాధీనం చేసుకున్నారు. వీరిని అరెస్టు చేసి రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించినట్లు పేర్కొన్నారు.

గడపగడపకు సంక్షేమం



కైకలూరు : కలిదిండి మండలం తాడినాడలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే డీఎన్నార్



ముసునూరు : మండలంలోని యల్లాపురంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు తదితరులు

నర్సింగ్ విద్యార్థినుల ఆందోళన



ఆందోళన చేస్తున్న నర్సింగ్ విద్యార్థినులు

ఏలూరు టౌన్: ఏలూరు ప్రభుత్వ బోధనాసుపత్రిలోని ప్రభుత్వ బీఎస్సీ నర్సింగ్ కళాశాల విద్యార్థినులు తమకు నాణ్యమైన ఆహారం అందించడంలేదని, సరైన సదుపాయాలు లేవని, డబ్బులు వసూలు చేశారంటూ భారీ ఎత్తున ఆందోళనకు దిగారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిరసన తెలిపారు. 300 మంది విద్యార్థినిలు ఆందోళనకు దిగడంతో పరిస్థితి ఉద్రిక్తంగా మారింది. పూర్వ కళాశాల ప్రిన్సిపల్ కవిత తమ వద్ద భారీగా సొమ్ములు వసూలు చేశారని ఆరోపించారు. ప్రస్తుత ప్రిన్సిపల్ దీనాకుమారి ఎంత చెప్పినా విద్యార్థినులు వినకపోవడంతో ప్రభుత్వ మెడికల్ కళాశాల ప్రిన్సిపల్ భీమేశ్వర్‌కు విషయాన్ని తెలిపారు. అధికారులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఏలూరు టూటౌన్ సీఐ చంద్రశేఖర్, ఎస్ఐ రామకోటేశ్వరరావు, సిబ్బంది కళాశాల వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తెచ్చారు.

మౌలిక వసతులు లేక ఇబ్బందులు

నాణ్యత లేని భోజనం పెడుతున్నారని విద్యార్థినిలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి మిగిలిన భోజనాన్ని పులిహోర చేసి ఉదయం పెట్టడంతో అది చెడువాసన వస్తుందని చెబుతున్నారు. కళాశాలలోని సుమారు 300 మంది విద్యార్థినులకు కేవలం నాలుగు బాత్‌రూంలు మాత్రమే ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెబుతున్నారు. కళాశాలలో చదువుకునే విద్యార్థినులు భోజనానికి నెలకు రూ. 2100 చెల్లించాలి. అదే విధంగా యూనిఫామ్, పుస్తకాలకు మరో రూ.6 వేలు చెల్లించాల్సి ఉంటుంది. దీనికి సంబంధించి ప్రభుత్వం నెలకు భోజనానికి, ఇతర ఖర్చులకు సొమ్మును విద్యార్థినుల ఖాతాల్లో వేస్తుంది. ఆ సొమ్మునే గతంలో పనిచేసిన ప్రిన్సిపల్ కవిత విద్యార్థినుల నుంచి వసూలు చేసినట్లుగా యాజమాన్యం చెబుతోంది. మౌలిక సదుపాయాలకు సంబంధించి ఉన్నతాధికారులకు ఇప్పటికే నివేదిక ఇచ్చామని ప్రిన్సిపల్ దీనాకుమారి తెలిపారు. మరుగుదొడ్లు, తాగునీరు సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.